వస్తుసృష్టియందు కౌశలము జూపినాఁడు. పలుకుబడి కందిన పాఁతసరసనకు క్రొమ్మెఱుఁగు లిచ్చి విలువ పెంచిన గడుసరివర్తకుఁడు. దుబారావెచ్చమునకొప్పఁడు. తనరచనల నన్నిట తనపొదుపు, తనవైలక్షణ్యమును ముద్రించినాఁడు. వృత్తముల నన్నిటిని దడచి తుదకు గీతికను వలచినాఁడు. తనగీతిక లోఁగొనని భావము లేదు. తనకలము గురియని రసము లేదు. కరుణమా?- కఠినపాషాణము నేని కరఁగింపఁగల ఈతని 'గోగీతము' 'పాపాయి' 'అపవాదము' 'పైడిలేడి' "కుంద" లోనగునవి చూఱ లీయఁగలవు. త్యాగశీలమా?- ఈతఁడు రచించిన 'తేనెచినుకులు' లోని "కేసబియాంక" "బాలవీరుఁడు" "సత్యకాముఁడు" మొదలుగాఁగల గీతికల యందు ధ్వనింపఁగలదు. చరిత్రయా?-'శివాజీ శీలము' 'అక్బరు నిర్వేదము' మున్నగు కతలలో ప్రతిఫలింపఁగలదు. పరియాచకమా?- ఈచిన్నిపొత్తమునందలి 'కవి-ధనికుఁడు' 'చెవిటిభాగవతము' 'లక్క-గేదె' 'జీవహింస' మొదలగునవి విందు సేయఁగలవు ఇట్లెన్నెని గలవు. పట్టీవ్రాసె పఠితను విసిగింప నొల్లను. పదలుబ్ధుఁడయ్యు భావసామ్రాజ్యములను నిర్మించినాఁడు. జిలుగు చిత్తారి నగిషీలలో తనపనితనమును చూపినపట్టు లున్నవి. పుష్పాడితిప్పలఁ బయనించు పుష్ప రథము కృష్ణరాయని శైలియని ఒక్కమాటలో ననవచ్చును. తనవలెనే శీలబద్ధమగు గతులలోఁ దనవాణిని నడపించి నాఁడు. తనలేఖినిని రసాధిదేవతకుఁ గానుక పట్టినాఁడు. కవిపట్టము నధిష్ఠించి 'మధురకవి' యనిపించుకొన్నాఁడు. నేఁటి కవితిలకులలో నొక్కఁడుగ గణ్యత గన్నాడు.

## కవిత్వము:

"వ్యంగ్యము లేనిది కవిత్వము కాదు:—వట్టి వాచ్యము. కవిత్వము లేని వ్యంగ్యము ఛాందసము."- టాల్స్టాయ్.

వ్యంగముం గూడిన కవితయే కృష్ణరాయనిరచనకు ముఖ్యలక్షణము. పరిశ్రమము లేని పదజాలమున భావతీవ్రత గోచరించినది. ప్రాతపలుకు మొత్తమునుండి క్రొత్తతలఁపులు కోరగించినవి. మలుపులు మెలికలు లేని లలితగతులకుఁ బుట్టినిల్లు. సూటిగ అంతఃకరణమును గిలిగింతలబెట్టు ఫణితి. ఉత్ప్రేక్షలుండవు. శ్లేష లుండవు. సమాస సమ్మర్దము లుండవు. లోకజ్ఞతయందు అతిలోకభావములను స్ఫురింపజేయు నైపుణ్యము చూపడినది. ప్రకృతివిలాసము నావిష్కరించుటయు కవితకు పరమార్థమని వెల్లడించినది. వస్తువుమీఁద చూపు, ధ్వనిమీఁద మోజు, రసముమీఁద మనసు, నానుడియందుతీపి, పలుకునాణెముమీఁద మరులు, భావమున మెలఁకువ, వృత్తియెడ స్వాధీనత, ప్రకృతిమీఁద ప్రభుత్వము గలిగి ప్రశంసాభాజనమయిన కవిత్వమే కృష్ణరాయనివశవర్తినియైనది. పూర్వాంధ్రకవితాగుణములకుఁ బొత్తుకూర్చినది. కాలము ననుసరించినది. రసపిపాసువై అటనట వ్యాకరణము నొత్తిగించి రసము సేకరించినది. వాడుకమాటలకుఁ దిగుపట్టుల తావొసఁగి భావమునకు జీవము వోసినది. స్వాతంత్ర్యముం జాటి ప్రశస్తిగాంచినది. "వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి" అనినట్లు, సజ్జనునిచిత్తమును సాధ్వీశీలమును దలపించు నితనికవితాలత తెలుఁగునుడిపొలమున మేలిపలపుల విరజిమ్మినది.

## ప్రయోజనము :

మెత్తని చిట్టినోడువులలో తరగతికిఁదగినతలఁపులను బొదిగి గీతములుగ పోతపోయఁబడినది ఈపొత్తము. ఇందలి ఒక్కొక కతయు ఒక్కొక ధర్మమును రుచి పుట్టునట్లు చిత్రింపఁబడినవి. శిశువుల కోమలము లగు చిత్తవృత్తులకు ఇంపిత మగు శైలి యున్నది; కుతూహలము పుట్టించు కత లున్నవి. ఈ గ్రంథమునందలి బోధనలు బాలుర ధార్మిక జీవనమునకు, తల్లిపాలవలె, తుష్టిని పుష్టిని బెంపఁగల వనిన అతిశయోక్తి కాదు. రసజ్ఞులు ఈ కవికృతముల ప్రయోజనము నెఱిఁగి వినియోగింతురని తమ వివేకమును చాటినవారగుదురు; బాల-బాలికల భావిజీవనములకు సంస్కారపథములఁ జూపిన పుణ్యము కట్టుకొందురు. ఇట్టి గ్రంథముల మూలమున కృష్ణరాయఁడు, తెలుఁగుతల్లికి ఊడిగము చేయుటయు కాదు- తన 'ముద్దు' కై తలను లోక మేఁగించుటయు కాదు- ఈద్వారమున తెలుగుబిడ్డలకు తల్లిమీదతీపు గలిగించినాఁడు; తెలుఁగుకైత యెడవలపు గొలిపినాఁడు; దేశసేవాపరాయణత తెలియఁ జెప్పినాఁడు; భారతీయధార్మిక జీవనమునకు మప్పినాఁడు; ఇట్లు 'మానవసేవ' నుద్ధరించినాడు; కృతార్థుఁడైనాఁడు. కవి యని మఱచి, కన్నతల్లి ననుకొని, బిడ్డలకు వినోదముగ ముద్దులలో బుద్ధులుగ అపినాఁడు మా 'మధురకవి'-

"మ్లానస్య జీవకుసుమస్య వికాసనాని,
సంతర్పణాని సకలేంద్రియ మోహనాని,
ఏతాని తే సువచనాని............
కర్ణామృతాని మనసశ్చ రసాయనాని."

## సభాజనములు:

నిసుఁగుల లేఁతమనస్సులకు తేలికగ నెక్కునట్టి పఠన గ్రంథములు లేని కొఱఁత దీర్చ ప్రత్యేకముగ నీతికథలను గీతికలలో రచించుటను, కృష్ణరాయఁడు వెదకిన తెన్నులు, చదివిన పొత్తములు, పట్టిన యోగము, పడిన శ్రమ మొగ్గ దొడిగినది. ఆపువ్వులే 'మనుఁగీతికలు' పేరి మంజరినుండి వెలువడిన ఆ"తేనెచినుకులు"ను, ఈ "పాలతరగలు" ను; ఇంకను ఇట్టి ప్రచురణములు వరుసగా సాగించుటకు చాలినంత సామగ్రి నితఁడు సమకూర్చుకొన్నాఁడు. ఇందు స్వతంత్రరచనలతో ఆంగ్లానువాదములును జతపడినవి. పై ప్రచురణములలో 'తేనెచినుకుల' నాదరించి, 'టెక్స్టుబుక్కు కమిటీ' వారు గుణజ్ఞు లనిపించుకొనిరి. ఇట్లే కమిటీ వారు తమచూపులను ఈ "పాలతరగలు" మొదలుగా రాఁగల ప్రచురణములయెడఁ బఱపి, తమకొదవిన యవకాశమును వినియోగించి, రచయితకు ప్రోత్సాహము, దాన తెలుఁగుబిడ్డలకు తెలివితేటలను గూర్తురని తమగుణజ్ఞతతో ధర్మజ్ఞతయు వెల్లడి కాఁగల దని విన్నవించుచున్నాను.

## హెచ్చరిక:

ఇట్టి మెచ్చులు అగ్గింపులు సహజమగు నలసత్వమును పెంపు చేయకుండు గాతమని నాయనుంగును కృష్ణరాయని హెచ్చరింతును. గుణజ్ఞుల యాదరాతిశయము ఈకవికలమునకు సానఱాయి యై పదనుపెట్టు గాక.

రాజమహేంద్రవరము,
౭—౧౨—౧౯౩౮

తనవాఁడు,
మున్నంగి—శర్మ.

## గాలిపడగ

పడగ, త్రోఁకయు, నొక్కంత వాయుబలము
నమరినంతన, పెనుబాము నైతి నంచు
ఇనుని మ్రింగఁగ నింగిపై కెగసె దౌర!
కాలి కూలవె మసి యౌచు గాలిపడగ?

గగనమున పక్షినై వడి నెగిరెద నని
ధారుణీస్థలి నిన్ను పతంగ మనుచు
పిలిచినంత, పతంగుని పిలుకుమార్ప
మింటి కెగసెద, వెంతటి మిడిసిపాటో?

పెంటఁ బొరలాడు గోచుల నంటఁగట్టి
తోఁక యొక్కటి తగిలింప, త్రుళ్ళిపడుచు
అల్ల హానుమంతుతో సాటి నైతి ననుచు
గంతులిడియెదవే భానుమంతు మ్రింగ.

దారుణోజ్వలకిరణుండు తపనుఁ డేడ,
ఉల్లిపొరవంటి నెమ్మైన నల్లలాడు
నట్టి నీ వేడ? అక్కటా! ముట్టినంత
బగ్గు మని కాలి కూలవె బుగ్గి యగుచు?

